www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 9 జనవరి 2023
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు



నేడు 'డయల్ యువర్ కమిషనర్'

ప్రజాశక్తి -నెల్లూరు
ప్రజా సమస్యల పరిష్కార వేదికగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలకు పరిష్కారం పొందాలని కమిషనర్ హరిత సూచించారు. నేడు కార్పొరేషన్ కార్యాలయంలో జరిగే స్పందన వేదికలో సమస్యల పరిష్కారం కోసం 'డయల్ యువర్ కమిషనర్' కార్యక్రమంలో భాగంగా ఉదయం 9:30 నుంచి 10:30 వరకు 0861-2355678 నెంబరుకు ఫోన్ ద్వారా సమాచారం అందిం చాలన్నారు. అనంతరం కార్యాలయంలో నేరుగా కలిసి సమస్యలను ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

సోమశిల

హైలెవల్ కెనాల్ పనులు పూర్తి చేయాలి

అఖిలపక్ష రైతు సదస్సు

మాట్లాడుతున్న ఎంఎల్‌సి విటపు బాలసుబ్రమణ్యం

ప్రజాశక్తి -మర్రిపాడు
. సోమిశిల హైలెవల్ కెనాల్ పనులు త్వరితగతిన పూర్తి చేసి మెట్ట ప్రాంతాలకు సాగు, త్రాగు నీరు అందించాలని ఎంఎల్‌సి విటపు బాలసుబ్రమణ్యం డిమాండ్ చేశారు. మర్రిపాడులో ఆదివారం అఖిలపక్ష రైతు సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఎంఎల్‌ఎసి విటపు బాలసుబ్రహ్మణ్యం పాల్గొని మాట్లాడారు. సోమశిల జలాశయంలో నీరు పుష్కలంగా ఉపయోగించుకునే పరిస్థితి లేదన్నారు. రైతులు పండించిన వరి ధాన్యానికి గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రెండో పంటను నిలిపివేశారన్నారు. దీంతో జలాశయంలో నీరు వృథాగా ఉందన్నారు. ఈ నేపథ్యంలో సోమశిల హైలెవల్ కెనాల్ పూర్తి చేసినట్లయితే మెట్ట ప్రాంతాలకు సాగునీరందిం చవచ్చాన్నారు. తద్వారా పంటల సాగుకు అవకాశం ఏర్పడు తుందన్నారు. వర్షాకాలంలో జలాశ యంలో నీరు ఎక్కువ భాగం సముద్రం పాలవు తుందన్నారు. రాజకీ యాల కతీతంగా అందరు కలిసి హై లెవెల్ కెనాల్ పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ మెట్ట ప్రాంతాల్లో పంటలు పండక, ప్రజలకు కూలి పనులు లేక వలసలు పోతున్నా రన్నారు. మెట్ట భూములు సస్యశ్యామలం కావలంటే సోమశిల హైలెవల్ కెనాల్ పూర్తి చేయాల్సిన అవసరముందన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించెందుకు పరిశ్రమలు స్థాపించాలని, అందు కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. రైతు సంఘం నాయకులు చంద్ర రాజగోపాల్ మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం హై లెవెల్ కెనాల్ పనులు ప్రారం భించిందన్నారు. ఏళ్లు గడిచినా నిర్మాణ పనులు నత్త నడక న సాగుతున్నాయన్నారు. ప్రాజెక్టు పనులు పూర్తి చేసేందుకు ఐక్యంగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీరాములు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగలం పుల్లయ్య, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి గంట లక్ష్మిపతి, సిపిఎం మండల కార్యదర్శి రహంతుల్లా , వైసిపి మండల కన్వీనర్ సుబ్బిరెడ్డి, వైసీపీ మండల నాయకులు కోనంకి శ్రీనివాసులు నాయుడు, బ్రాహ్మణపల్లి మాజీ సర్పంచ్ అమర్నాథ్ రెడ్డి, ఐద్వా మండల కార్యదర్శి శ్యామలమ్మ అధ్యక్షురాలు మూలి ప్రమీల, జనసేన మండలా ధ్యక్షురాలు ఓ ప్రమీల, వ్యవసాయ సంఘం నాయ కులు గంగినేని తిరుపతినందవరం, రామా నాయుడు పల్లి సిపిఎం నాయకులు సుధాకర్ మహ మ్మద్ గౌస్ ఆరు మండలాల కార్యదర్శులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

సంస్కరణల పేరుతో

పట్టణ ప్రజలపై భారాలు

పట్టణ నివాస ప్రాంతాల సంఘం రాష్ట్ర కన్వీనర్ సిహెచ్ బాబురావు విమర్శ

మాట్లాడుతున్న సిహెచ్ బాబూరావు

ప్రజాశక్తి-నెల్లూరు
పట్టణ సంస్కరణల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై పెను భారాలు మోప ుతుందని పట్టణ నివాస ప్రాంతాల రాష్ట్ర కన్వీనర్ సిహెచ్ బాబూరావు విమర్శించారు. చెత్తపన్ను, ఇంటి పన్ను, విద్యుత్ భారాలు మోపడం తోపాటు మంచినీటి మీటర్ల ఏర్పాటును వ్యతిరే కిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్ట నున్నామని, రాజకీయ పార్టీల కతీతంగా ప్రజలందరూ పాల్గొని ప్రభుత్వ చర్యలను వ్యతిరేకిం చాలని ఆయన పిలుపు నిచ్చారు. ఆదివారం నగరంలోని డాక్టర్ రామ చంద్రారెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మాటలకు, చేతలకు సంబంధం ఉండటం లేదన్నారు. సంక్షేమ పథకాల్లో కోతలు పడుతున్నా యన్నారు. ప్రజలపై పన్ను భారాలు మోపుతున్నారన్నారు. కోటీ యాభై లక్షల మంది ఉన్నటువంటి పట్టణ జనాభాపై తీవ్రమైన భారాలు మోపిందన్నారు. పట్టణాల్లో ఉండేట టువంటి మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను ప్రజలను పీడించి పన్నులు వసూలు చేసే ఒక వ్యాపార సంస్థలుగా ప్రభుత్వం మార్చివేసిందని విమర్శించారు. రాష్ట్రంలో విద్యుత్ పరిస్థితి ఘోరంగా ఉందన్నారు. 'ట్రూఅప్ ఛార్జీ'ల పేరుతో సుమారు రూ.2900 కోట్ల 36 నెలల్లో వసూలు చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే రంగం సిద్ధం చేసిందన్నారు. ప్రభుత్వం ఈ ఏడాది విద్యుత్ చార్జీలు పెంచి సుమారు రూ.15వందల కోట్లు మేరకు ప్రజలపై అధనపు భారం మోపిందన్నారు. మళ్లీ తాజాగా విద్యుత్ ఛార్జీలు వసూలు చేసేందుకు ప్రభుత్వం పథకాలు సిద్ధం చేసిందన్నారు. ఇప్పటికే విద్యుత్ నియంత్రాణ మండలిలో ఈ నెల 19,20,21 తేదీల్లో విచారణ జరగబోతుందన్నారు. విద్యుత్ సంస్థ ఆదాయం, వ్యయం రెండిటి మధ్య 13 వేల కోట్ల మేరకు తేడా చూపిస్తుందన్నారు. ఈ తేడాను ఏవిధంగా సరిచేస్తారో ఇప్పటి వరకు తెలియని ప్రశ్నగా ఉందన్నారు. ప్రతి ఇంటికి ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం టెండర్లు పిలిచిందన్నారు. ఈ మీటరు ఖర్చు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు ఉంటుందన్నారు. ఇది వినియోగదారుడిపై ప్రభుత్వం వేస్తుందన్నారు. ఇప్పటికే ఆర్‌టిసి బస్సు ఛార్జీలు పెరిగాయని, అటు రాష్ట్రం, ఇటు కేంద్రం రెండు కలిసి అమలు చేస్తున్న విధానాల వల్ల వంటింటి గ్యాస్, పెట్రోల్, డీజల్ ధరలు, వస్తువుల ధరలు పెరిగిపోయా యన్నారు. ప్రజలను బెదిరించడం, భయభ్రాం తులకు గురి చేసి పన్నులు వసూలు చేస్తుందన్నారు. కరెంటు మీటర్లతోనే ప్రజలు విలవిలలాడుతుంటే అమృత పథకం పేరుతో మంచినీటి కుళాయి పేరుతో ప్రతి ఇంటికి నీటి మీటర్లు ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఈ విధంగా కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం అందుకు పట్టణ సంస్కరణ అనే పేరు పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ భారాలన్నింటికీ వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా సిపిఎం ఉద్యమాలకు సిద్ధం అవుతుందన్నారు. అందులో భాగంగా ఈ నెల 19,20,21 తేదీల్లో రెగ్యులేటరీ కమిషన్ ముందు అభిప్రాయాలు తెలియజేస్తామన్నారు. పట్టణ నివాస ప్రాంతాల జిల్లా కన్వీనర్ మాదాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీ, కార్పోరేషన్ పరిధిలో ప్రజలపై పన్నుల భారం ప్రభుత్వం స్థానిక సంస్థల ద్వారా విధిస్తుందని విమర్శిం చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ సంస్కరణల పేరుతో ప్రజలపై భారాలు మోపడం దారుణమన్నారు. ఇటువంటి చర్యలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకిం చాలన్నారు. ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకింగా జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల్లో, నగర కార్పోరేషన్ పరిధిలో సిపిఎం ఆందోళనలు చేపడుతుందన్నారు. ఈ ఆందోళన కార్యక్రమాలకు ప్రజలు సంపూర్ణ మద్దతు తెలియజేయాలని కోరారు.

22న పెంపుడు కుక్కల ప్రదర్శన

ప్రజాశక్తి -నెల్లూరు :ఈ నెల 22న వి.ఆర్ హైస్కూల్ క్రీడా మైదానంలో నెల్లూరు కెన్నెల్ క్లబ్ ఆధ్వర్యంలో పెంపుడు కుక్కల ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు క్లబ్ కార్యదర్శి బి.సురేంద్రకుమార్ తెలిపారు. ఆదివారం స్థానిక మాగుంట లే అవుట్ ప్రాంతంలోని డాక్టర్ ఎం. వెంకటస్వామిరెడ్డి పెంపుడు కుక్కల క్లీనిక్‌లో నిర్వహించిన సమావేశంలో సభ్యులు ఈ నిర్ణయం తీసుకున్నారు. క్లబ్ అధ్యక్షులు బొబ్బల శ్రీనివాసులు యాదవ్ అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ మెడికల్ సలహాదారుడు ఎం. వెంకట స్వామిరెడ్డి కార్యదర్శి బి. సురేంద్ర కుమార్ మాట్లాడుతూ ఈ పెంపుడు కుక్కల ప్రదర్శనలో 25 రకాల జాతుల కుక్కలు పాల్గొంటాయన్నారు. ఈ ప్రదర్శన తమ క్లబ్ ఆధ్వర్యంలో 23వ డాగ్‌షోగా పేర్కొన్నారు. ప్రదర్శనలో పాల్గొనదలచిన వారు రైల్వే ఫీడర్స్ రోడ్డు ప్రాంతంలోని వెటర్నరీ పాలీ క్లీనిక్, మాగుంట లే అవుట్ ప్రాంతంలోని పెంపుడు కుక్కల క్లీనిక్ నందు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ ప్రదర్శనలో పెంపుడు కుక్కల యజమనాలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వివరాలకు 9849226008, 9849416130 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

మనోహర్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి-నెల్లూరు :ఇటీవల గుండెపోటుకు మృతి చెందిన ఆటో కార్మికుడు ఎం.మనోహర్‌రాజుకు జిల్లా ఆటో కార్మిక సంఘం ఘన నివాళి అర్పించింది. ఆదివారం అయ్యప్పగుడి సెంటర్‌లోని ఆటో స్టాండ్ ప్రాంతంలో మనోహర్ మృతికి సంతాప సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఎం రూరల్ కార్యదర్శి బత్తల కృష్ణయ్య, సిఐటియు రూరల్ అధ్యక్ష, కార్యదర్శులు కొండా ప్రసాద్, కిన్నెర కుమార్‌లు మాట్లాడుతూ మనోహర్ సేవలను కొనియాడారు. మృతుడికి తల్లి తప్ప బంధువులు ఎవ్వరూ లేని పరిస్థితి కావడంతో అయ్యప్పగుడి సెంటర్ ఆటో కార్మికులు, హౌసింగ్ బోర్డు ఆటో కార్మికులు ఆత్మీయులై అంతిమ సంస్కారాలు నిర్వహించారన్నారు. అంతే కాకుండా మృతుడి ఇంటి వద్ద కర్మక్రతువులు సైతం ఆటో కార్మికులే నిర్వహిం చారన్నారు. ఈ సంతాప సభలో ఆటో యూనియన్ నాయకులు దేవతాటి సంపత్ కుమార్ , ఎం సుధాకర్ , భవన నిర్మాణ కార్మిక సంఘం రూరల్ కార్యదర్శి ఎస్‌కె ఖలీల్ ,పులిమి నరసింహారెడ్డి , స్థానిక కమిటీ అధ్యక్ష కార్యదర్శులు ప్రవీణ్ కుమార్, శంకర్, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

ఎంఎల్‌ఎ 'మానుగుంట' పరామర్శ

ప్రజాశక్తి - లింగసముద్రం
లింగసముద్రంలోని వైసిపి నాయకులు, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు షేక్ షఫి గతకొంత కాలం నుంచి అనారోగ్యంతో బాధ పడుతున్నారు. చెన్నయ్‌లో వైద్యం చేయించుకొని ఆరోగ్యం మెరుగుపడిన తరువాత కావలిలోని బంధువుల ఇంటికి చేరుకున్నాడు. ఈ నేపథ్యంలో ఆదివారం ఎంఎల్‌ఎ మానుగుంట మహీధర్‌రెడ్డి పరా మర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్యం వివరాలను తెలుసుకున్న మహీధర్‌రెడ్డి షఫికి 25వేలు ఆర్థిక సాయం చేశారు. మంచి వైద్యం తీసుకుని త్వరగా కొలుకోవాలని ఆకాంక్షించారు. మండల వైసిపి కన్వీనర్ పిచ్చపాటి తిరుపతిరెడ్డి,మండల వైసిపి మీడియా అధికార ప్రతినిధి వరికూటి క్రిష్ణారెడ్డి ఉన్నారు.

ఎపి సర్పంచ్‌ల సంఘం ఉపాధ్యక్షులుగా బసవయ్య నాయుడు

ప్రజాశక్తి -కందుకూరు : రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం నూతన కార్యవర్గంలో జిల్లాలోని మన్నేటికోట సర్పంచ్ పులివర్తి బసవయ్య నాయు డుకు చోటుదక్కింది. ఆయన సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నిక య్యారు. శనివారం జరిగిన రాష్ట్ర పంచాయతీ ఛాంబర్ సర్పంచ్‌ల సంఘం నూతన కార్యవర్గంలో భాగంగా వ్యవస్థాపక అధ్యక్షుడు వై.బి రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షతన నియామక పత్రాన్ని బసవయ్య నాయుడుకి అందజేశారు. ఈ సంద ర్భంగా బసవయ్యకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

వైబి రాజేంద్రప్రసాద్ నుంచి నియామకపత్రం అందుకుంటున్న బసవయ్యనాయుడు

ఎపి జెన్కో పరిరక్షణ పోరాటానికి

ఇంజినీర్ల అసోసియేషన్ సంపూర్ణ మద్దతు

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి
ఎపి జెన్కో (శ్రీదామోదరం సంజీవయ్య ధర్మల్ విద్యుత్ కేంద్రం) ప్రయి వేటీకరణకు వ్యతిరేకంగా 350 రోజుల నుంచి జరుగుతున్న పోరాటానికి అఖిలభారత విద్యుత్ ఇంజినీర్ల ఫెడరేషన్ అధ్యక్షులు శైలేంద్ర దుబే, అఖిలభారత నాయకులు, రాష్ట్ర నాయకులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఎపిపిఎస్ఇబి ఇంజినీర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎపి జెన్కో వద్ద ఆదివారం నిర్వహించిన ర్యాలీ అనంతరం జరిగిన సభలో వారు ప్రసంగించారు. ఎపి జెన్కో జెఎసి, పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న పోరాటాన్ని అభినందించారు. ఉద్యమాన్ని కొనసాగించాలని, అందుకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. ఎపి జెన్కో పరిరక్షణ కమిటీ కన్వీనర్ ఎం మోహన్‌రావు,, గోగుల శ్రీనివాసులు, గడ్డం అంకయ్య, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు డి. సూరిబాబు, నాయకులు రామయ్య ,సుమంత్ ,నాగయ్య, జన్కో జేఏసీ నాయకులు సి.హెచ్. ఆదిశేషయ్య, నాగరాజు, భాస్కర్ ,అనిల్ ,నక్క మోహన్ రావు ,ఆదిలక్ష్మి తదితరులు వినతి పత్రం అందజేసి కార్యక్రమంలో పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పారిశుద్ధ్యం అధ్వానం..

జ్వరాలు ప్రబలుతాయని జనం ఆందోళన

ప్రజాశక్తి-అల్లూరు
మండలంలో ఇటీవల వర్షాకాలంలో విషజ్వరాలు విజృంభించాయి. దీంతో చలి తీవ్రతరం కావడంతో మళ్లీ జ్వరాలు విజృం భిస్తాయోమనని జనం భయాందోళన చెందుతున్నారు. ప్రధానంగా డెంగీ, టైఫాయిడ్, అతిసార భారిన పడ్డారు. గ్రామాల్లో నెలకొని ఉన్న వాటర్ ట్యాంకులు శుభ్రం చేయకపోవడంతో కలుషిత నీటి కారణంగా అనేక వ్యాధులు సంభవించాయని స్థానికులు చెబు తున్నారు. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిన కారణంగా జ్వరాలు ప్రబలాయి. ఈ నేపథ్యంలో డ్రెయినేజి వ్యవస్థను పటిష్టపరచాలని కోరుతున్నారు. అధికారులు గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టకపోవడంతో ఇలాంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ప్రచార ఆర్భాటాలు తప్పితే ఇసుమంతైన పని కనిపించడం లేదని బాధిత ప్రజలు బహిరంగ వ్యాఖ్యలు చేస్తున్నారు. కనీసం దోమలకు మందును పిచికారి అలాగే మురుగు ప్రదేశాలలో బ్లీచింగ్ చల్లించే స్థితి కూడా కాన రావటంలేదని ఆగ్రహావేశాలు వ్యక్తపరుస్తున్నారు. మండలంలో 10 పంచాయతీలు, నగర పంచాయతీ పరిధిలో కూడా పారిశుధ్య నిర్వహణకు ఎక్కడ కూడా చర్యలు చేపట్టిన దాఖలు లేవంటున్నారు. ఆయా శాఖల అధికారులు పంచాయతీల్లో నిధులు లేవని సరి పెట్టుకోవడంతో ప్రజలు విమర్శనాస్త్రాలు గుపిస్తున్నారు. అధికారులు సత్వరమే స్పందించి గ్రామాల్లో అస్తవ్యస్తంగా ఉన్న పారిశుధ్య నిర్వహణకు తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పాఠశాల సమస్యలను ఎంఎల్‌ఎకు వివరిస్తున్న హెచ్‌ఎం

ఎంఎల్‌ఎ దృష్టికి పాఠశాల సమస్యలు

ప్రజాశక్తి - లింగసముద్రం : మాలకొండ్రాయునిపాలెం గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో ఉన్న సమస్యలను పరిష్కరిం చాలని పాఠశాల ప్రధా నోపాధ్యాయులు కెవి.క్రిష్ణారెడ్డి గ్రామానికి వచ్చిన ఎంఎల్‌ఎ మానుగుంట మహీధర్‌రెడ్డిని కోరారు. దీంతో స్పందించిన ఆయన పాఠశాలను పరిశీలించారు. పాఠశాల భవనం శిథిల వ్యవస్థకు చేరిందని, కొన్ని వసతులు లేవని దీని వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఎంఎల్‌ఎకు వివరించారు. పాఠశాలకు కావాల్సిన వసతుల గురించి వినత పత్రం ఇవ్వాలని ఎంఎల్‌ఎ చెప్పారు. త్వరలోనే పాఠశాల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఇన్‌ఛార్జి ఎంఇఒ రవికూమార్ ఉన్నారు.

విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

జోరుగా గంజాయి విక్రయాలు

ప్రజాశక్తి -కందుకూరు : పట్టణంలో గంజాయి విక్రయాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. గత కొంతకాలంగా గంజాయి వ్యాపారం జరుగుతున్న ఎక్సైజ్ అధికారులు గానీ, పోలీసులు గానీ దాని గురించి పట్టించుకున్న పాపాన పాలేదు. దీంతో గంజాయి పాఠశాల విద్యార్థులు తాగే పరిస్థితికి వచ్చారు. కందుకూరు జెడ్‌పి బాలుర పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు గంజాయిని ఇచ్చలవిడిగా వాడుతున్నారు. ఈ విషయం శనివారం బయట పడింది. దీంతో పాఠశాల ఉపాధ్యాయులు రంగంలోకి దిగి విద్యార్థులను గట్టిగానే మందలించారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి విద్యార్థుల వద్దకు వచ్చి గంజాయి ఎలా వస్తుంది. ఏంటి అనే విషయంపై ఆరా తీశారు. కందుకూరు పట్టణంలో గంజాయి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతుందనే విషయం కొద్ది రోజుల క్రితం పత్రికలు వెలుగులోకి తెచ్చాయి. ఆ సందర్భంలో పోలీసులు వందల కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసులు పెట్టడం జరిగింది. ఆ తర్వాత దాని గురించి పట్టిం చుకోలేదు పోలీసులు ఎక్సైజ్ అధికారులు ఇప్పటికైనా కళ్ళు తెరిచి గంజాయి వ్యాపారులపై ఉక్కుపోదాం మోపవలసిన అవసరం ఉంది. విద్యార్థులకు కందుకూరు సీఐ వెంకటరావు, ఎస్ఐ కిషోర్‌బాబు కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగింది.

నెల్లూరులో ట్రాఫిక్ కష్టాలు

ప్రజాశక్తి -నెల్లూరు
నెల్లూరు నగరంలో ట్రాఫిక్ సమస్య తీవ్రమైంది. ప్రధానంగా ముత్తుకూరు సెంటర్‌లో మినీ బైపాస్ రోడ్డులో ఫ్లైఓవర్ నిర్మాణ పనులు జరుగుతండటం కారణంగా అటుగా వెళ్లే వాహన చోదకులకు ఇబ్బందిగా ఉంది. దీంతో వాహనచోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరో వైపు సంక్రాంతి పండుగ సమీపిస్తుండటంతో షాపింగ్ కాంప్లెక్స్‌ల వద్ద జనం బారులు తీరుతున్నారు. ఈ కారణాల దృష్ట్యా నగరంలో గత రెండు రోజుల నుంచి ట్రాఫిక్ పెరిగింది. పండుగ వేళల్లో ట్రాఫిక్ నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోకపోతే సమస్య మరింత జఠిలమవుతుందని చెబుతున్నారు.

అర్హులందరికీ పింఛన్

మాట్లాడుతున్న ఎంఎల్ఏ రామిరెడ్డి

ప్రజాశక్తి-బిట్రగుంట

అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కావలి శాసన సభ్యులు రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బోగోలు మండలం జక్కపల్లి గూడూరు పంచాయతీలో గ్రామంలో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం పేదవారి కోసం రైతుల కోసం పనిచేస్తుందని, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్లు, ఇళ్ళు అందిస్తున్నారని, కొంతమందికి పెన్షన్లు తీసేస్తారని అసత్యాలను ఎవరూ నమ్మవద్దని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందుతుందన్నారు. కార్యక్రమంలో గోవిందరావు, సర్పంచ్ బండి సురేష్‌గౌడ్, వైసిపి మండల కన్వీనర్ మద్దిబోయిన వీర రఘు, వైసిపి నేతలు పెంచలయ్య, మాచర్ల, మల్లెరెడ్డి, సుందర్ రాజ్, గండూరి శ్రీను, మేకల శ్రీను, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'క్షయ' రహిత సమాజ నిర్మాణానికి కృషి

ప్రజాశక్తి-నెల్లూరు

గతంలో టిబి (క్షయ) వ్యాధి అంటే అది అంటువ్యాధి అని ప్రజలు తీవ్ర భయాందోళనలకు లోనవుతుండేవారు. వైద్యశాస్త్రం వేగంగా అభివృద్ధి చెంది అనేక వ్యాధుల నియంత్రణకు మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించేందుకు పరీక్షలు నిర్వహించేందుకు ల్యాబ్‌లను ఆసుపత్రుల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వ్యాధి నిర్ధారణ అయిన తరువాత ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన వైద్యం అందజేసి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేస్తుంది. ఈ నేపథ్యంలో జిల్లాలో టిబి నిర్మూలనకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నార్తో టిబి నియంత్రణాధికారి డాక్టర్ జి.వెంకట ప్రసాద్ మాటల్లో ...

జిల్లా టి.బి. నియంత్రణాధికారి డాక్టర్ జి.వెంకటప్రసాద్

ఇంటర్వ్యూ

ప్రశ్న. టిబి వ్యాధి ఎలా వస్తుంది. దీని లక్షణాలు వివరిస్తారా..?

జవాబు. క్షయవ్యాధి మైకోబాక్టీరియం ట్యుబర్ క్యులోసిస్ అనే బ్యాక్టీరియా వస్తుంది. ఇది అంటువ్యాధి ప్రపంచ ఆరోగ్య సంస్థ విడుదల చేసిన నివేదికను అనుసరించి టిబి ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక అంటువ్యాధి సంబంధిత మరణాల రేటుకు ప్రధాన కారణమని నిర్ధారించింది. సాధారణంగా దగ్గు, తుమ్ముల ద్వారా గాలిలోకి విడుదలయ్యే చిన్న చిన్న నీటి బిందువుల ద్వారా సులువుగా ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుంది. ఈ బ్యాక్టీరియా సాధారణంగా ఊపిరితిత్తులు, మెదడు, మూత్రపిండాలు, వెన్నెముక వంటి శరీరంలోని ఇతర భాగాలను సోకుతుంది. ఆకారణంగా బరువు తగ్గడం, నిరంతరం దగ్గు, రాత్రి సమయాల్లో చెమట పట్టడం వంటివి ప్రధాన లక్షణాలుగా చెప్పవచ్చు. ఈ బ్యాక్టీరియా శరీరంలోకి ప్రవేశించిన తరువాత క్రియారహితంగా మారిపోవడం కారణంగా రోగికి ఎటువంటి లక్షణాలను కనిపించవు. దశల వారీగా బలహీనమైన అనారోగ్యంతో ఇబ్బంది పడటం సంభవిస్తుంది. హెచ్ఐవి, ఎయిడ్స్‌తో బాధపడు తున్న వారు, మద్యం సేవించేవారికి ఈ వ్యాధి సులువుగా సోకుతుంది.

ప్రశ్న. ఈ వ్యాధి నిర్ధారణకు ఎటువంటి పరీక్షలు చేసుకోవాల్సి ఉంటుంది..? ఈ వ్యాధి నివారణకు చికిత్స విధానాలు వివరించండి..?

జవాబు. క్షయ వ్యాధి నిర్ధారణకు పలు రకాల పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. చర్మ పరీక్ష ద్వారా వ్యాధి నిర్ధారణ చేసుకోవచ్చు. ఈ పరీక్షలను మాంటోక్స్ ట్యూబర్ క్యులిన్ చర్మ పరీక్ష లేదా ట్యూబర్‌క్యులిన్ చర్మ పరీక్ష, లేదా టిఎస్‌టి అని వైద్యశాస్త్రంలో పిలుస్తారు. ఈ పరీక్ష సర్వసది కాదని చెప్పవచ్చు. బిసిజ వ్యాక్సిన్ తీసుకున్న వారిలో పాజిటివ్‌గా నిర్ధారణ అవుతుంది. మరి కొంత మందిలో యాక్టివ్ టిబి లేకపోయిన ఈ పరీక్షకు ప్రతిస్పందిస్తారు. ఛాతీ పరీక్ష (ఎక్స్‌రే), కఫం (గళ్ళ) పరీక్ష, కల్చర్స్ పరీక్ష, తదితర పరీక్షలు చేసుకోవడం వల్ల వ్యాధి నిర్ధారణ చేసుకోవచ్చు. వ్యాధి నిర్ధారణ అయిన తరువాత వైద్యుని సలహా, సూచనల మేరకు మందులు వాడుకోవాల్సి ఉంటుంది. వ్యాధి సంక్రమణ రకాన్ని బట్టి ఆరు నుంచి తొమ్మిది నెలల వరకు క్రమం తప్పకుండా ఒకటి లేదా అంతకంటే ఎక్కువ మందులు వాడుకోవాల్సి వస్తుంది. ప్రారంభ దశలో ఉన్న వారు ఐసోనియాజిడ్, రిఫాంపిన్, పైరజినమైడ్, ఇథంబుటోల్ 14 డోసులు రెండు వారాలు వాడుకోవాలి. తరువాత వారానికి రెండు సార్లు 12 డోసులు ఆరు వారాలు వాడుకోవాలి.

ప్రశ్న. 2021లో ఎంత మందికి క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు.. ఎంతమందికి టి.బి ఉన్నట్లు నిర్ధారణ అయింది.. క్షయ వ్యాధితో బాధపడుతున్న వారికి ఎంత మందికి హెచ్ఐవి పరీక్షలు నిర్వహించారు..?

జవాబు. 2021లో జిల్లాలో 32,22,865 మంది జనాభా ఉంటే ప్రభుత్వం 38,122 మందికి క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించింది. అయితే వైద్యఆరోగ్యశాఖ, స్వచ్ఛంద సంస్థల సంయుక్త కృషితో 41,400 పరీక్షలు నిర్వహించాం. 5,597మందికి టి.బి.లక్షణాలు ఉన్నట్లు నిర్ధారణ అయింది. జిల్లాలో క్షయవ్యాధితో బాధపడుతున్న వారికి హెచ్ఐవి నిర్ధారణ పరీక్షలు చేయగా 4,690 మందికి లక్షణాలు ఉన్నట్లు గుర్తించాం. 2020 సంవత్సరంలో క్షయ వ్యాధి గ్రస్తులకు పూర్తి స్థాయిలో మందులు, ఒక క్రమపద్ధతిలో వాడటంతో 3,324 మంది టి.బి.ని జయించారని చెప్ప డానికి ఎంతో ఆనందంగా ఉంది. 2021లో టిబి వ్యాధి గ్రస్తుల చక్కెర వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసుకోగా 4,435 మందికి మధుమేహ వ్యాధి నిర్ధారణ అయింది.

ప్రశ్న. జిల్లాలో ఎంత మంది మల్టీడ్రగ్ రెసిస్టెంట్ క్షయ వ్యాధిగ్రస్తులున్నారు. ఈ మందులు వాడటం వల్ల ఇప్పటి వరకు ఎంత మంది టిబిని జయించారు..?

జవాబు. జిల్లాలో 2019వ సంవత్సరంలో మల్టీడ్రగ్ రెసిస్టెంట్ మందులను వైద్యుల సలహాలు, సూచనల మేరకు 251 మంది తీసుకున్నారు. 199 మంది పూర్తి ఆరోగ్యవంతులుగా కోలుకున్నారు. 2021లో 205 మందికి మల్టీడ్రగ్ రెసిస్టెంట్ మందులు అవసరమని ప్రభుత్వం గుర్తించి బాధితుల పేర్లను రిజిస్టర్ చేసుకున్నారు. వీరందరికీ ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో మందులు పంపిణీ చేస్తున్నాం.

రోసయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

చంద్రగిరి రోసయ్య వర్ధంతి

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

పేదల సమస్యలపై నిరంతరం అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు చంద్రగిరి రోసయ్య అని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు జొన్నలగడ్డ వెంకమరాజు అన్నారు. సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం బుచ్చిరెడ్డిపాలెంలో జొన్నవాడ సెంటర్‌లో రోసయ్య స్థూపం వద్ద ఆయన 14వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం మాట్లాడుతూ పట్టణంలో పేదప్రజల నివాసాల కోసం పోరాటాలు చేసి సుమారు 500 కుటుంబాలకు కాలువ పోరంబోకు స్థలంలో నివాసాలు ఏర్పాటు చేశారని కొనియాడారు. సిపిఐయం మండల కార్యదర్శి చల్లకొలుసు మల్లికార్జున మాట్లాడుతూ జక్కా వెంకయ్య ఎంఎల్ఏగా ఉన్న సమయంలో కూరగాయల మార్కెట్, ముస్లిం మైనార్టీలకు షాదీమంజిల్ నిర్మించేందుకు కృషి చేశారన్నారు. ఆయన చనిపోయే వరకు పేదప్రజల కోసం, పార్టీ కోసం పనిచేశారన్నారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి పాతంశెట్టి శ్రీనివాసులు, ఆవాజ్ నాయకులు షేక్ జానీబాషా, డివైఎఫ్ఐ నాయకులు దత్తశ్రీ కోటయ్య, నాయకులు ఓలేటి ప్రభాకర్, దుర్గా ప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర పంచాయతీరాజ్ కార్యవర్గ సమావేశం

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

మండలంలోని మైపాడు సముద్రతీరంలో ఏపీ పంచాయతీరాజ్ డిప్లొ ఇంజనీర్ల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రెసిడెంట్ కె.రవీంద్ర, జనరల్ సెక్రటరీ రత్నా ప్రసాద్‌లు పాల్గొని పలు అంశాలపై చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ డిప్లొమో విద్యార్హత కలిగిన డిఈఈలకు వారికి క్రమంలో ఉన్న విధంగా 1:3 నిష్పత్తిలో ఇఇలుగా ప్రమోషన్ కల్పించాలన్నారు. అలాగే డిగ్రీ అర్హత కలిగిన వారికి ఎఇ ఛానల్ నుండి డిఈఈలుగా ప్రమోషన్ కల్పించి, హైకోర్టు తీర్పును అమలు చేయాలన్నారు. అలాగే ప్రతి ఎఇకి ప్రతి నెలా 3000 ట్రావెలింగ్ అలవెన్స్ జీతంతో పాటు చెల్లించాలన్నారు. జిల్లా కలెక్టర్లు, ఇంజనీర్లు పనుల ప్రోగ్రెస్ పేరిట వేధింపులు మానుకోవాలన్నారు. అడహక్ ఎఇలను రెగ్యులర్ చేయాలన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులుగా ఎవిఆర్ రియాజ్, వ్యవహరించారు. అడ్వైజర్ హనుమంతరావు, అసోసియేట్ ప్రెసిడెంట్ శ్రీనివాసమూర్తి, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాంబాబు, కోశాధికారి మురళీకృష్ణ, జనరల్ సెక్రటరీ శ్రీ వాసు, అసోసియేట్ ప్రెసిడెంట్ మస్తాన్, తదితరులున్నారు.

'రూటా' క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

రియాసతి ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షులు సయ్యద్ అబ్దుల్ హమీద్ అధ్యక్షతన ఆత్మకూరు పట్టణంలోని అభిరామ్ హాస్పిటల్ అధినేత డాక్టర్ కెవి శ్రావణ్ కుమార్ రెడ్డి ఉర్దూ బాషాభివృద్ధికి చేసిన సేవలను కొనియాడుతూ హాస్పిటల్ ఆవరణంలో సన్మానం చేశారు. ఈ సందర్భంగా రూటా 2023 వార్షిక క్యాలండర్‌ను, స్టిక్కర్‌ను డాక్టర్ శ్రావణ్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనారిటీల విద్యా బలోపేతం కోసం ప్రస్తుత ప్రభుత్వం ఉర్దూ బాషను రెండవ అధికార భాషగా చేసిందని గుర్తుచేశారు. భవిషత్తులో ఉర్దూ భాష సమస్యలు వాటి పరిష్కారాలపై సానుకూల దృక్పథంతో ఉంటానని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు షేక్ సాదిక్‌హుస్సేన్, రాష్ట్ర సిపిఎస్ కన్వీనర్ షేక్ జావీద్, జిల్లా లెక్చరర్ వింగ్ అధ్యక్షులు షేక్ అహ్మద్ మొహిద్దీన్, రాష్ట్ర అడిషనల్ జెనరల్ సెక్రటరీ షేక్ జిలానీబాషా, జిల్లా ఉపాధ్యక్షులు షేక్ ఖాజా హుస్సేన్, షేక్ ఖాదర్‌బాషా, షేక్ షఫీ, ఉర్దూ బాషాభిమానులు పాల్గొన్నారు.

అసంఘటిత కార్యక్రమాలకు అడ్డగా మారిన పోలీస్ క్వార్టర్స్

గంజాయి మత్తులో యువత..

ప్రజాశక్తి-అల్లూరు

మండలంలో యువకులు అడ్డూ అదుపు లేకుండా పెడదోవ పడుతూ గంజాయి మత్తులో మునిగి తేలుతున్నారని పలువురు ప్రజలు బహిరంగ విమర్శల వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా నగర పంచాయతీ నడిబొడ్డులో ఉన్న పోలీస్ క్వార్టర్స్ అలాగే ఆర్‌టిసి బస్టాండ్ తదితర నిర్వీర్య ప్రాంతాలలో గంజాయి మత్తుకు బానిసలై యువత పెడదారిన పడుతున్నారని అనేకమంది తెలియజేశారు. వీరిని కట్టడి చేయడంలో అంతా విఫలమయ్యారని విమర్శలు గుప్పిస్తున్నారు. నిర్మానుష్య ప్రాంతాలను కేంద్రంగా చేసుకొని గంజాయి, పేకాట తదితర దందాలను కొనసాగిస్తున్నారు. చీకటి వేళల్లో అసంఘటిత కార్యక్రమాలకు పాల్పడుతూ ప్రశ్నిస్తే ఎదురు తిరిగి దౌర్జన్యం చేస్తున్నారంటూ స్థానికులు వాపోతున్నారు. ఇందులో గంజాయికి బానిసలైన ఎంతోమంది విద్యార్థులు అధికంగా ఉన్నారని తెలియజేస్తున్నారు. కొంతమంది బాధ్యత లేని వ్యక్తులతో చెడు సావాసాలు చేసి భారీగా యువత పక్కదారి పడుతున్నారని సమాచారం. కాగా ఈ వ్యక్తులు జనసంచారం లేని నిర్మానుష్య ప్రాంతంలో అడ్డా కొనసాగిస్తున్నారని స్థానికులు తెలియజేస్తున్నారు. విచ్చలవిడితనంతో వీరి ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో వృద్ధులు మాత్రమే ఇలాగే వ్యవహరించే వాళ్లని ప్రస్తుతం యువకులు మత్తులో మునిగి తేలడంతో ప్రభుత్వాలపై ఆగ్రహావేశాలు వ్యక్తపరుస్తున్నారు. తల్లిదండ్రులు మంచి దృక్పథంతో పిల్లలు చదువుకొని ఉద్ధరిస్తారని ఆకాంక్షిస్తున్న నేపథ్యంలో జల్సాలకు అలవాటు పడుతూ మత్తులో జీవితాన్ని గడుపుతున్నారన్న విచారం వ్యక్త పరుస్తున్నారు. అలాగే విచ్చలవిడితనంతో జన సంచారం ఉన్న ప్రదేశాలలో అధిక స్పీడుతో బైకులను నడపడం నడిపే వాహనాలలో సైలెన్సర్ నుండి భారీ శబ్దాలు రావడంతో అనేక రుగ్మతలతో బాధపడుతున్న పేషెంట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీరి ఆగడాలను వెంటనే కట్టడి చేయాలని ఉన్నతాధికారులను కోరుతున్నారు.

'కాకర్ల' ట్రస్ట్‌తో అభివృద్ధి పనులు

- ట్రస్ట్ ప్రారంభోత్సవంలో సురేష్

ప్రజాశక్తి-కలిగిరి

మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గ రూపురేఖలను కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా యువత సహాయంతో మారుస్తానని కాకర్ల సురేష్ ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని బొమ్మరాజు చెరువు సమీపంలో ఆదివారం కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ సేవలు ప్రారంభించారు. ట్రస్టు సేవలు ఉదయగిరి నియోజకవర్గంలో 25 సంవత్సరాల పాటు కొనసాగించి పేద, బడుగు, బలహీన వర్గాలకు వృద్ధులకు నిరుద్యోగ యువతకు తోడ్పాటు ఇస్తానని హామీనిచ్చారు. గత మూడు సంవత్సరాలుగా నియోజకవర్గంలో ట్రస్ట్ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. టిడిపి టికెట్ విషయం విలేకరులు ప్రశ్నించగా అధిష్టానం ఆదేశిస్తే ఆలోచిస్తానన్నారు. అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో తానా చైర్మన్‌గా తెలుగు ప్రజలకు పలు సేవలు అందించినట్లు తెలిపారు. చిన్నతనం నుండి గవర్నమెంట్ పాఠశాలలో విద్యను అభ్యసించి కష్టపడి ఈ స్థాయికి ఎదిగినానని తెలిపారు. ట్రస్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వైద్య క్యాంపు నిర్వహించి రోగులకు ఉచితంగా టెస్టులు, మందులు పంపిణీ చేశారు. బ్యూటీషియన్, టైలరింగ్, డ్రైవింగ్ వంటి ఉచిత కార్యక్రమాలను కూడా నిర్వహించారు. కార్యక్రమంలో ఆత్మకూరు మాజీ ఎంఎల్‌ఎ కొమ్మి లక్ష్మయ్య నాయుడు, కాకర్ల సోదరులు సునీల్, వెంకటేష్, మహేష్, కాకర్ల కుటుంబీకులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు అన్నదానం

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణం నివాసులు నూతన వధూవరులైన నూనే.సృజన్ కుమార్ –శిరోమణిలతో వారి బావమరిది రమేష్ సంయుక్త సేవా సంస్థ ఉచిత కుట్టు శిక్షణా కేంద్రంలో ఆదివారం నిరాదరణకు గురైన పిల్లలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో దాత రమేష్, నూతన వధూవరులు, సంస్థ గౌరవ సభ్యులు ఎం.అజిత్ బాబు, సంస్థ ఉపాధ్యక్షుడు గంధం ప్రసన్నాంజనేయులు, సంస్థ అధ్యక్షుడు సురేంద్ర, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

10న టిడిపి 'చలో కావలి'

ప్రజాశక్తి-కావలి

10వ తేదీన "చలో కావలి", 18 నుండి టిడిపి ఇంటింటి ప్రచారం కార్యక్రమాలను జయప్రదం చేయాలని నెల్లూరు పార్లమెంట్ ఇన్‌ఛార్జి అబ్దుల్ అజీజ్, కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం కావలి పట్టణ కోర్టు వెనకవైపు ఉన్న క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ కళ్యాణమండపంలో కావలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన పత్రికా విలేకరుల సమావేశంలో వారితో పాటు ఉదయగిరి మాజీ శాసనసభ్యులు కంభం విజయరామిరెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ 10వ తేదీన కావలిలో జరిగే చలో కావలి కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని పిలుపు నిచ్చారు. అలాగే కావలి నియోజకవర్గంలో ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు ఆధ్వర్యంలో

మాట్లాడుతున్న అబ్దుల్ అజీజ్

ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమం చెప్పడతారని, ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలను, నియోజకవర్గ ప్రజలను కోరారు. ఈ సందర్భంగా చలో కావలి గోడపత్రికలను నేతలు ఆవిష్కరించారు. సమావేశంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులందరూ పాల్గొన్నారు.

పట్టుబడిన నిందితులతో పోలీసులు

కోడి పందేల స్థావరాలపై దాడులు

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని సింగనపల్లిలో కోడిపందేల స్థావరాలపై ఆదివారం ఆత్మకూరు సిఐ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడిలో ఆరుగురు నిందితులను, నాలుగు కోడిపుంజులు, రూ. 2150లు నగదు, ఆరు మోటార్ బైకులను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడులలో మర్రిపాడు, అనంతసాగరం ఎస్‌ఐలు రాజేష్, సంతోష్‌రెడ్డి, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

పోలేరమ్మ ఉత్సవానికి ముమ్మర ఏర్పాట్లు

ప్రజాశక్తి-అల్లూరు

అల్లూరు ప్రజల ఆరాధ్య దైవమైన శ్రీ అల్లూరు పోలేరమ్మ ఉత్సవానికి ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నట్లు కావలి మాజీ ఎఎంసి చైర్మన్ మన్నె మాల సుకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పోలేరమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఉత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు గ్రామస్తులతో కలసి భారీ సన్నాహాలు చేస్తున్నామని వివరించారు. ఇందులో కావలి ఎంఎల్ఏ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సహకారం ఉందన్నారు. 10వ తేదీ మంగళవారం ఉత్సవానికి పెద్దలు ఏర్పాట్లు చేశారన్నారు. ఈ నేపథ్యంలో భక్తులు అమ్మవారిని దర్శించుకు నేందుకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పలు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. క్యూ లైన్

మాట్లాడుతున్న మన్నెమాల సుకుమార్‌రెడ్డి

ద్వారా ప్రతి ఒక్కరూ అమ్మవారిని దర్శించుకుంటారని కాగా విఐపిలకు ప్రత్యేక దర్శనం ఉంటుందన్నారు. అభిషేకం, అఖండ ప్రతిష్ట, సద్ది నివేదన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. సాంప్రదాయబద్ధంగా ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్న ఆచారమని వ్యాఖ్యానించారు. అలాగే పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలియజేశారు.

ఎన్‌సిసి విద్యార్థులకు పరీక్ష

ప్రజాశక్తి-నెల్లూరు

10వ ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సిసి నెల్లూరు లెఫ్టినెంట్ కమాండర్ వినయ్ రామచంద్రన్ కమాన్డింగ్ ఆఫీసర్ ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరు నగరం భక్తవత్సల నగర్‌లోని కె.ఎన్.ఆర్.నగర పాలక ఉన్నత పాఠశాలలో 'ఎ' సర్టిఫికెట్ వార్షిక రాత పరీక్ష, డ్రిల్, షిప్ మోడలింగ్, మౌఖిక పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలకు 281 మంది ఎన్.సి.సి.కేడెట్లకు గానూ 255 మంది కేడెట్లు హాజరయ్యారు. కార్యక్రమంలో సెకండ్ ఆఫీసర్ గుండాల నరేంద్రబాబు, సి.వి.నాగరాజు థర్డ్ ఆఫీసర్, కేర్ టేకర్లు డి.పెంచలయ్య, అరోరా, మస్తానయ్య, భక్తవత్సల బాబు నాయుడు, నాగరాజు, కృష్ణమోహన్, మల్లికార్జున, ఎన్‌సిసి పిఐ స్టాఫ్ ఈశ్వర రావు, దీపక్‌కుమార్, షాన్వాజ్, షిప్ మోడలింగ్ ఇన్‌స్ట్రక్టర్ రామన్ తదితరులున్నారు.

అధ్వానంగా అనంతసాగరం-సోమశిల రోడ్డు

- రోడ్డు నిర్మాణం చేపట్టాలని సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి-అనంతసాగరం

అనంతసాగరం నుంచి సోమశిలకు వెళ్లే రోడ్డు అడుగడుగునా గుంతలు ఏర్పడడంతో ప్రయాణికులు బేంబేలెత్తిపోతున్నారని, గుంతలు పూడ్చి రోడ్డు నిర్మాణం చేపట్టాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. జిల్లాలో ప్రసిద్ధ పర్యాటక కేంద్రంగా ఉన్న సోమశిల ప్రాజెక్టు చూడటానికి నిత్యం పర్యాటకులు వస్తూ ఉంటారనీ ఈ రోడ్డు మార్గంలో భారీ ఇసుక లారీలు నిత్యం తిరగడం వల్ల రోడ్డు అధ్వానంగా మారిందని తెలిపారు. నిత్యం ఆ రహదారిపై అధికార పార్టీ నాయకులు, అధికారులు తిరుగుతూ ఉంటారన్నారు. కానీ ఈ రోడ్డును పట్టించుకోవడం లేదని, ముఖ్యంగా మంచాలపల్లి, ఉప్పలపాడు, కమ్మవారిపల్లి గ్రామాల వద్ద రోడ్డుపై గుంతలుపడి ఉన్నాయని తెలిపారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 3సంవత్సారాలు పూర్తి చేసుకున్న ఆ రోడ్డు గుంతల్లో ఒక తట్ట మట్టి కూడా వేయలేదన్నారు. నాయకులు చాలా రోజుల నుండి ఆత్మకూరు సోమశిలకు డబుల్ రోడ్డు త్వరలో వేస్తారనే



ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఎంఎల్ఎ ఒకసారి ఆ రోడ్డుపై ప్రయాణం చేస్తే ఆ బాధ ఆయనకు తెలుస్తుందని ప్రయాణికులు అంటున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు, మండల వైసిపి నాయకులు స్పందించి ఎంఎల్ఎ దృష్టికి ఈ సమస్యను తీసుకొని వెళ్లి రోడ్డుపై ఉండే గుంతలు కనీసం మట్టి అయినా వేసి సమస్యను పరిష్కరించాలని సిపిఎం తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. లేనిపక్షంలో రోడ్డు సమస్యలపై సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చెపడతామన్నారు.

విరువూరు-పామూరు రోడ్డు

ప్రజాశక్తి-వరికుంటపాడు

మండలం లోని విరువూరు - పామూరు రోడ్డు అధ్వానంగా తయారైంది. పామూరు నుంచి ఉదయగిరి వయా (పెద్దిరెడ్డిపల్లి) వెళ్లే రోడ్డు నిత్యం వందల సంఖ్యలో ప్రయాణికులు ప్రయాణం సాగిస్తుంటారు. ద్విచక్ర వాహనదారులు ఆటోవాల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది నిత్యం ప్రమాదాలు చోటుచేసుకునే గాయాల పాలవుతున్నారు. రాత్రి సమయాల్లో రోడ్డు బాగుందని వెళ్తున్న ద్విచక్ర వాహనదారులు బోల్తాపడి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఈ రహదారిపై విరువూరు, కృష్ణంరాజు పల్లి, నార్త్ కొండయ్యపాలెం, పెద్దిరెడ్డిపల్లి, తోటల చెరువుపల్లి, పామూరు పల్లి, మహుందాపురం, ఎర్రంరెడ్డిపల్లి, ఇసుకపల్లి, తదితర పంచాయతీల చెందిన ప్రజలు వివిధ పనులపై నిత్యం పామూరుకు రాకపోకలు సాగిస్తుంటారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కావలిలో వరుస సైకిల్ దొంగతనాలు

ప్రజాశక్తి-కావలి

పట్టణ పరిధిలో ఇటీవలి కాలంలో వరుస సైకిల్ దొంగతనాలు జరుగుతున్నా పోలీసు యంత్రాంగం మాత్రం ప్రేక్షకపాత్ర వహిస్తూ, చోద్యం చూస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. ఎక్కువగా 1వ పట్టణ పరిధిలోనే ఈ సైకిల్ చోరీలు జరుగుతున్నాయని బాధితులు వాపోతున్నారు. ఐదు మంది ఎస్.ఐ.లు ఉన్న స్టేషన్ పరిధిలోనే ఇన్ని దొంగతనాలు జరుగుతుండడంతో పోలీస్ వ్యవస్థపై నమ్మకం సన్నగిల్లిపోతుందని ప్రజలు తెలియజేస్తున్నారు. కంప్లెయింట్ ఇవ్వడానికి స్టేషన్‌కు వెళ్లిన బాధితులకు రిసిప్షన్ వద్ద చేదు అనుభవం ఎదురవుతున్న నేపథ్యంలో దిక్కుతో చనిస్థితిలో బాధితులు ఎవరి దగ్గరకు వెళితే న్యాయం జరుగుతుందో అర్థం కానీ పరిస్థితి నెలకొంది. పెద్దపెద్ద వాటికే దిక్కులేదు వెయ్యి రూపాయలు కూడా ఖరీదు చేయని వాటికోసం రిపోర్టు ఇవ్వడానికి వచ్చారా అని పోలీసులు ప్రశ్నిస్తుండడంతో వెనుదిరుగుతున్నట్లు బాధితులు అంటున్నారు. పట్టణంలోని సి.సి. కెమెరాలు చూస్తే ఆ దొంగలు ఎవరో తెలుస్తోందని ప్రశ్నించిన వారికి మీ ఇంటి ముందు సి.సి. కెమెరాలు పెట్టుకోండని ఉచిత సలహాలు ఇచ్చి పంపిస్తున్నారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు పట్టణంలోని సి.సి. కెమెరాల ద్వారా పరిశీలించి సైకిళ్లు దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను గుర్తించి పట్టణంలో సైకిల్ దొంగతనాలకు చమరగీతం పాడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

డివైడర్‌ను ఢీకొన్న బైక్

- మహిళ మృతి

ప్రజాశక్తి-కోవూరు

కొడవలూరు మండలం యల్లాయపాలెంకు చెందిన భార్య భర్తలు మోటార్ సైకిల్‌పై నెల్లూరు వెళ్తుండగా అతివేగంతో వెళ్తూ స్పీడ్ కంట్రోల్ చేయలేక డివైడర్ ఢీకొన్నారు. ఈ ఘటనలో పద్మజ అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందగా, భర్త రమేష్ తలకు బలమైన గాయమైంది. వారి చికిత్స నిమిత్తం 108లో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సుధామయి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-బిట్రగుంట


సుధామయికి అభినందనలు తెలియజేస్తున్న నాయకులు

కావలి ఉద్యానవన శాఖ అధికారి సుధామయి జన్మదినం సందర్భంగా కాండ్ర సతీష్ నాయుడు యువ నేస్తం ద్వారా వారి నివాసంలో గిరిజన జాగృతి వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాపట్ల వెంకటపతి, గ్లోబల్ విద్యా సంస్థ అధినేత సాధనాల దామోదర నాయుడు ఆదివారం కలసి పూలబుకే అందజేసి జన్మదిన శభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం బాపట్ల వెంకటపతి మాట్లాడుతూ సుధామయి ఉద్యానవన శాఖ అధికారిగా కావలి ప్రాంత రైతులకు పాడి పంటలు పండ్ల తోటలు ద్వారా రైతులు అభివృద్ధి చెందేలా అవగాహణ పెంపొందించి రైతులకు సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో సామాజిక నేత ఎం.మాలకొండారెడ్డి, గిరిజన నేత జేయం పూ.కనకయ్య, పీట్ల ప్రత్యూష్, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

ఆదరణకేంద్రంలో...

కావలి హార్టికల్చరల్ అధికారి సుధామయి జన్మదినం సందర్భంగా భవాని ఎడ్యుకేషనల్ సొసైటీ ఆదరణ కేంద్రంలో ఆదివారం సుధామయి అభిమానులు కేక్ కట్ చేసి అనాథలకు భోజనం పండ్లు అందజేశారు. కార్యక్రమంలో కాండ్ర సతీష్ నాయుడు పాలోవర్స్ వెంకటపతి, ప్రత్యూష్ ఆదరణ కేంద్రం డైరెక్టర్ కట్టిపల్లి సింహాద్రిరావు, తదితరులు పోల్గొన్నారు.

అల్లాభక్షుకు కేన్సర్ మహమ్మారి

- చికిత్సకు దాతల సాయం కోసం ఎదురుచూపులు

ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్

షేక్ అల్లాభక్షుకు భార్య ముగ్గురు పిల్లలతో ఆనందంగా సంతోషంగా సాగుతున్న తన కుటుంబాన్ని కేన్సర్ మహమ్మమారి సోకి ఆ కుటుంబాన్ని కబళించింది. కూలి పనులు చేసుకుని పూట గడుపుకునే ఆ కుటుంబం ఆర్థిక పరిస్థితి చిన్నభిన్నమైంది. వివరాల్లోకెళితే.. బతుకుతెరువు కోసం ఆత్మకూరు పట్టణానికి గత ఐదు సంవత్సరాల క్రితం వచ్చారు. ఓ చికెన్ కొట్టులో కూలీ పనికి చేరాడు. అల్లాభక్షుకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు వీరు ఆత్మకూరు పట్టణాలోని హిల్ రోడ్డులోని ఓ అద్దె ఇంటిలో నివాసం ఉన్నారు. చిన్నారులు ఇద్దరిని ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తూ ఉండగా చిన్న కుమార్తెను అంగన్‌వాడీ పాఠశాలకు పంపుతున్నారు. మూడో తరగతి చదువుతున్న కుమారుడు అబ్దుల్‌కి నరాల బలహీనతతో ఫిట్స్ వ్యాధి సోకి పలువురు డాక్టర్లను చూపి మందులు వాడుతున్నారు. కుమారుడు వైద్యానికి వేలాది రూపాయలు ఖర్చు అయింది. పిడుగు లాంటి కేన్సర్ ఇలా కుమారుడు వైద్యం కోసం కొంత ఖర్చు చేస్తూ చికెన్ కొట్టులో కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్న అల్లాభక్షు ఐదు నెలల క్రితం కేన్సర్ వ్యాధి సోకింది మెడపై గడ్డ రావడంతో ఆత్మకూరులోని పలు ఆసుపత్రుల్లో చూపించాడు. నయం కాకపోవడంతో నెల్లూరులోని ప్రభుత్వ ఆసుపత్రిలో చూపించగా అక్కడ కేన్సర్‌గా నిర్ధారణ అయింది. మెడపై గడ్డను ఆపరేషన్ చేసేందుకు సుమారు లక్షక పైగా ఖర్చు అయిందని తెలిపారు. ఆరోగ్యశ్రీ కార్డు ఉపయోగపడిన మందుల కోసం అధికంగా ఖర్చు అయిందని అతని భార్య షాకీరా తెలిపింది. రెక్కాడితే గానీ డొక్కాడని తమ కుటుంబానికి ఇప్పటికే ఫిట్స్‌కు గురైన కుమారుడికి వైద్యం చేస్తుండగా ఇంటి పెద్దకు కేన్సర్ సోకడంతో మంచానికే పరిమితమయ్యా డని దీంతో పూట గడవడం కష్టంగా ఉందని షాకిర ఆవేదన వ్యక్తం చేసింది. తెలిసిన వారి దగ్గర అప్పులు చేసి వైద్యం కోసం వారానికోమారు నెల్లూరు ఆసుపత్రికి తిరుగుతున్నట్లు ఆమె తెలిపింది. కుటుంబం గడిచేందుకు ఇళ్లల్లో పనులు చేసేందుకు వెళుతున్నట్లు ఆమె తెలిపింది. కీమోథెరపీ, రేడియాలజీ ఇలాంటి వైద్యం చేయాలంటే కొంత నగదు చెల్లించాల్సి ఉంటుందని ఆసుపత్రి వైద్యులు తెలపడంతో దిక్కుతోచని స్థితిలో ఇంటికి ఫలితం అయినట్లు ఆవేదన వ్యక్తం చేసింది. దాతలు ఎవరైనా దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సాయం అందిస్తేనే వైద్యం జరుగుతుందని కుటుంబ పోషణ భారమైన క్రమంలో దిక్కుతోచని స్థితిలో ఉన్నామని బాధిత కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎవరైనా దాతలు ముందుకు వచ్చి సాయం చేయాలన్నారు. సాయం చేయాల్సిన దాతలు ఆత్మకూరులో ఇండియన్ బ్యాంకు అకౌంట్ నెంబర్ 6528172922, ఫోన్‌పే నెంబర్ 7075103895లో సహాయం చేయాలని కోరుతున్నారు.